
చీడికాడ రోడ్డులో పూర్ణా థియేటర్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

పల్లెల్లో పరిశ్రమలు

యువతకు ఇక్కడే ఉపాధి

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు
- ఏపీఐఐసీకి వసతుల కల్పన బాధ్యత
- పరిశ్రమలు ఏర్పాటు చేసే ఔత్సాహికులకు ప్లాట్లు కేటాయింపు
- కోడూరు, అచ్యుతాపురం, పరవాడల్లో ఇప్పటికే ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి
- మిగిలిన చోట్ల భూముల పరిశీలన, ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఎలమంచిలి, 'పేట నియోజకవర్గాలకు భారీ పరిశ్రమలు రాక
- లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు


అచ్యుతాపురం సెజ్‌లో ఫ్లాటెడ్ కాంప్లెక్స్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

యువత ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోకుండా స్థానికంగానే ఉపాధి పొందేలా కూటమి ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మరోవైపు ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ, ప్రైవేటు రంగంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఫ్యాక్టరీ వంటి భారీ పరిశ్రమలు, ఔషధ రంగానికి సంబంధించి బల్క్‌డ్రగ్ పార్కుఏర్పాటు కానున్నాయి. ఇవన్నీ కార్యరూపం దాల్చితే జిల్లాలో లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయి.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో యువతకు ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని సంకల్పించింది. వీటిల్లో యూనిట్లు ఏర్పాటు చేయించడం ద్వారా గ్రామీణ యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతున్నది. ప్రతి నియోజకవర్గంలో సుమారు 100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. వీటికి భూసేకరణ కోసం ఈ ఏడాది జూన్‌లోనే ప్రభుత్వం మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో వున్న భూముల వివరాలను రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

అనకాపల్లి నియోజకవర్గానికి సంబంధించి అనకాపల్లి మండలం కోడూరులో 70 ఎకరాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్తు, నీరు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు రూ.6 కోట్లు ఖర్చు చేస్తున్నారు. సుమారు 250 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికే 180 మందికిపైగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ఇప్పటికే ఉన్న ఏపీఐఐసీ సెజ్‌లో 6.5 ఎకరాల్లో ఫ్లాటెడ్ కాంపెక్స్‌ను నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణం వుండేలా మొత్తం 50 బ్లాకులు నిర్మించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ బ్లాక్‌లను కేటాయిస్తున్నారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పరవాడలో ఏపీఐఐసీ సెజ్ ఫేజ్-2లో భాగంగా ఎంఎస్ఎంఈల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ రామన్నపాలెంలో ఏపీఐఐసీకి చెందిన భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం ఆర్లి, చింతలపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో భూములను గుర్తించారు. చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలంలో పలుచోట్ల భూములు పరిశీలించినట్టు తెలిసింది. నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుపై ఏపీఐఐసీ జిల్లా జోనల్ మేనేజర్ నరసింగరావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి సంప్రదించగా.. అచ్యుతాపురం, పరవాడ, కోడూరుల్లో ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక వసతుల పనులు జరగుతున్నాయన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో రెవెన్యూ అధికారులు భూములను తమకు అప్పగిస్తే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



అనకాపల్లి మండలం కోడూరులో ఎంఎస్ఎంఈ పార్కు

25లోగా ఈ-క్రాప్ నమోదు

ధాన్యం కొనుగోలుకు 63 కేంద్రాలు

- పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి
- అధికారులకు జేసీ జాహ్నవి ఆదేశం


పలు శాఖల జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు సంబంధించి ఈ-క్రాప్ నమోదును ఈ నెల 25వ తేదీలోగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, పౌర సరఫరాలు, మండల పరిషత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ-క్రాప్ నమోదు, పీజీఆర్ఎస్ అర్జీలు, భూముల రీసర్వే, ఐవీఆర్ఎస్, నీటి తీరువా వసూళ్లు, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 63 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అవసరమైతే మరిన్ని కేంద్రాలు మంజూరు చేస్తామన్నారు. ఖరీఫ్‌లో 35 వేల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం 8.5 లక్షల గోనె సంచులు అవసరమవుతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని పరికరాలు సమకూర్చాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేకపోతే అందుకుగల కారణాన్ని అర్జీదారునికి ఫోన్ చేసి తెలియపరచాలని స్పష్టం చేశారు. దీపావళి సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు, అమ్మకాలు జరిపే దుకాణాల వద్ద అగ్నిమాపక చర్యలు చేపట్టారా? లేదా? అన్నదానిపై మండల అధికారులు తనిఖీలు జరపాలని జేసీ జాహ్నవి ఆదేశించారు. లోపాలను గుర్తిస్తే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ వైసత్యనారాయణరావు, వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జయంతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య జటిలం

చోడవరంలో పెరిగిపోతున్న వాహనాల రద్దీ

- రహదారులను ఆక్రమించేస్తున్న వ్యాపారులు
- ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం
- ఆర్టీసీ కాంప్లెక్స్, కొత్తూరు జంక్షన్, చీడికాడ, లక్ష్మీపురం రోడ్లలో ట్రాఫిక్ కష్టాలు


చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుల కోసం రోడ్డుపై నిలిపిన ఆటోలు

చోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చోడవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ పెరిగిపోతున్నది. ఆరు మండలాలకు ప్రధాన కేంద్రం కావడంతోపాటు విశాఖపట్నం, అనకాపల్లి నుంచి పాడేరుకు చోడవరం మీదుగానే రాకపోకలు సాగిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. పట్టణంలో వున్న పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో స్థానికులతోపాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన వేలాది మంది చదువుకుంటున్నారు. వీరంతా ఇళ్ల నుంచి రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఇంకా చోడవరం మండలంతోపాటు కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో చాలా మంది చోడవరంలో నివాసం వుంటూ రోజూ వెళ్లి వస్తుంటారు. ఈ మండలాల్లో వున్న వివిధ రకాల వ్యాపారులు తమకు అవసరమైన సరుకులు, వస్తువులను చోడవరంలో కొనుగోలు చేస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులతోపాటు దినసరి కూలీలతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చోడవరం మెయిన్ రోడ్డు రద్దీగా మారుతున్నది. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, కొత్తూరు జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్నది. కొత్తూరు జంక్షన్ నుంచి దేవరాపల్లి వెళ్లే రోడ్డు, చీడికాడ రూట్లో పూర్ణా థియేటర్ సమీపంలో వాహనదారులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంటున్నారు. ఇంకా మెయిన్ రోడ్డు నుంచి లక్ష్మీపురం వెళ్లే మార్గంలో ఆర్చి వద్ద వాహనాల రద్దీ అధికంగా వుంటున్నది.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులు పోటీ పడి మరీ దుకాణాలను రహదారిపైకి తీసుకొస్తున్నారు. వీటికి ముందు తోపుడు బండ్లు వుంటున్నాయి. వాటి ముందు సర్వీసు ఆటోలను నిలుపుదల చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, కొత్తూరు జంక్షన్‌లో జనసందోహం అధికంగా వుంటున్నది. వాహనాల సంగతి అటుంచి కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు కానిపరిస్థితి నెలకొంటున్నది. మెయిన్ రోడ్డు నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్డులో పలు రకాల దుకాణాల షెడ్లు ముందుకు ఏర్పాటు చేశారు. దీనికితోడు ఆయా దుకాణాల ముందు వాహనాలను నిలుపుదల చేస్తుండడంతో పెద్ద వాహనాలు ఎదురైతే తప్పుకునే వీలుండడం లేదు. పట్టణంలో రహదారులపై వ్యాపారాలు, ఎక్కడపడితే అక్కడ వాహనాల నిలుపుదలతో రోడ్లు కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. అయినప్పటికీ పోలీసులు దృష్టిసారించక పోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

చీడికాడ రోడ్డు, లక్ష్మీపురం రోడ్డులో పగలు కూడా సరుకు రవాణా వాహనాలను అనుమతించడం, లారీలను రోడ్డుపైనే నిలిపివేసి సరుకు అన్‌లోడింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. పోలీసులు, పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.


ఏటికొప్పాకలో లక్కబొమ్మల తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు. పక్కన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఏటికొప్పాక కళాకారుల అభ్యున్నతికి కృషి

- జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

ఎలమంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక హస్తకళాకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి బుధవారం ఏటికొప్పాక గ్రామాన్ని సందర్శించారు. కళాకారులు అంకుడు కర్రతో బొమ్మలు తయారు చేయడాన్ని పరిశీలించారు. ఇప్పటికే తయారుచేసిన పలు కళాఖండాలను తిలకించి, వారి నైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు హస్తకళాకారులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హస్త కళాకారులను అభినందించి జ్ఞాపికలను అందించారు. నాగబాబు పర్యటనలో సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్, కూటమి నాయకులు కాండ్రకోట చిరంజీవి, బొద్దపు శ్రీను, రాజాన నారాయణమ్మ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లవుడు లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై దయ లేదా ?

సెస్సు సొమ్ము చెల్లించని స్థానిక సంస్థలు

- ఉమ్మడి జిల్లాలో రూ.250 కోట్లకుపైగా బకాయిలు
- ఇందులో రూ.220 కోట్లు జీవీఎంసీవే!
- పంచాయతీల బకాయిలు రూ.30 కోట్లు
- నిధులు లేక భారంగా మారిన గ్రంథాలయాల నిర్వహణ



నర్సీపట్నంలో శాఖా గ్రంథాలయం

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్సు బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ప్రజల నుంచి ఇంటి పన్నులతోపాటు లైబ్రరీ సెస్సును కూడా వసూలు చేస్తున్న స్థానిక సంస్థలు.. ఈ సొమ్మును జిల్లా గ్రంథాలయ సంస్థకు ఇవ్వడంలేదు. దీంతో గ్రంథాలయాల నిర్వహణ భారంగా మారింది.

జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో ప్రథమ శ్రేణి గ్రంథాలయాలు 6, ద్వితీయ శ్రేణి 2, తృతీయ శ్రేణి 51, గ్రామీణ గ్రంథాలయాలు 3... మొత్తం 67 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇవి కాకుండా పలుచోట్ల బుక్ డిపో సెంటర్లు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థలు చెల్లించే సెస్సు సొమ్ముతోనే గ్రంథాలయాలు మనుగడ సాగిస్తుంటాయి. కానీ కొన్నేళ్ల నుంచి ఆయా స్థానిక సంస్థలు ఇంటి పన్నులతోపాటు గ్రంథాలయ సెస్సు కూడా వసూలు చేస్తున్నప్పటికీ.. ఆ సొమ్మును జిల్లా గ్రంథాలయ సంస్థకు ఇవ్వడంలేదు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో మహా విశాఖ నగరపాలక సంస్థతోపాటు నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలు, తొమ్మిది వందలకుపైగా గ్రామ పంచాయతీలు వున్నాయి. ఆయా స్థానిక సంస్థలు ఏటా ప్రజల నుంచి ఆస్తి పన్నులు వసూలు చేస్తుంటాయి. ఇందులో ఎనిమిది శాతం గ్రంథాలయ సెస్సు వుంటుంది. అంటే వసూలైన పన్నుల నుంచి ప్రతి రూపాయికి ఎనిమిది పైసల చొప్పున జిల్లా గ్రంథాలయ సంస్థకు ఇవ్వాలి. కానీ చాలా కాలంగా స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయ సంస్థకు సెస్సు డబ్బులు రావడం లేదు. జిల్లా గ్రంథాయల సంస్థ అధికారుల గణాంకాల ప్రకారం ఒక్క జీవీఎంసీ నుంచే రూ.219.79 కోట్లు రావాల్సి ఉంది. సెస్సు చెల్లింపు విషయంలో నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలు ఒకింత సానుకూలంగా వున్నాయి. మునిసిపాలిటీలు ఏర్పడిన తరువాత నుంచి వసూలైన రూ.7.74 కోట్లలో రూ.7.01 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.73 లక్షలు రావాల్సి వుంది. గ్రామ పంచాయతీలు రూ.34.76 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.4.71 కోట్లు మాత్రమే చెల్లించాయి. మొత్తం మీద జిల్లాలోని అన్ని రకాల స్థానిక సంస్థల నుంచి రూ.250 కోట్లకుపైగా గ్రంథాలయ సెస్సు రావాల్సి వుంది. దీనివల్ల గ్రంథాలయాల నిర్వహణ ఇబ్బందికరంగా తయారైంది. శిథిలస్థితికి చేరిన భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించలేకపోతున్నారు. ఉన్న భవనాలకు చిన్నపాటి మరమ్మతులు చేయడానికి కూడా నిధులు లేవు. ఇక పాఠకుల కోసం కొత్త పుస్తకాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోయింది. విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను కొన్నిచోట్ల దాలతల ఆర్థిక సాయంతో కొనుగోలు చేస్తున్నారు. స్థానిక సంస్థలు గ్రంథాలయ సెస్సు సొమ్మును ఇవ్వకపోవడంపై గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సెస్సు బకాయిల వసూలుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు.

హైవే దిగ్బంధంపై కేసు నమోదు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు

- ఎస్పీ తుహిన్ సిన్హా
- నక్కపల్లి నుంచి రాజయ్యపేట వరకు పోలీసు బలగాల మోహరింపు


ఉపమాక నుంచి నడుచుకుంటూ రాజయ్యపేట వెళుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు

నక్కపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల జాతీయ రహదారిని దిగ్బంధం చేసిన ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు తెలిపారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతుండడంతో నక్కపల్లి నుంచి రాజయ్యపేట వరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ఇక్కడకు వచ్చిన ఎస్పీ.. రాత్రి వరకు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సెక్షన్ 30 అమలులో వున్నందున ఆందోళనలు, ర్యాలీలు, రహదారులను దిగ్బంధం వంటి చర్యలను గట్టిగా అడ్డుకోవాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాజయ్యపేటలో శాంతియుతంగా నిరసన తెలియజేసుకోవడానికి మత్స్యకారులకు అనుమతులిచ్చామని, కానీ ఇందుకు విరుద్ధంగా ఈ నెల 12వ తేదీన నాలుగు గంటలపాటు జాతీయ రహదారిని దిగ్బంధించారని అన్నారు. దీనివల్ల అంబులెన్సుల్లో ఆస్పత్రులకు తరలిస్తున్న రోగులు, వివిధ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కొంతమంది ప్రేరేపించడంతో మత్స్యకారులు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించారని ఎస్పీ అభిప్రాయపడ్డారు. రాజయ్యపేటలో జరిగే ధర్నాలో బయట వ్యక్తులు పాల్గొనడానికి అనుమతుల్లేవని ఆయన స్పష్టం చేశారు.

పలువురు సీఐల బదిలీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి టౌన్ సీఐ టీవీ విజయ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న జి.ప్రేమ్‌కుమార్‌ను నియమించారు. అలాగే విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.రమేశ్‌ను అనకాపల్లి టాస్క్‌ఫోర్స్‌కు, వీఆర్‌లో మరో సీఐ జె. మురళీని నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు నియమించారు.

నాందేడ్ ప్రత్యేక రైలుకు అరకొర స్పందన

సాధారణ బోగీ ఒక్కటీ లేని వైనం

- ఏసీ బోగీల్లో కానరాని ప్రయాణికులు


ప్లాట్ ఫారంపై నాందేడ్ రైలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి బుధవారం మధ్యాహ్నం నాందేడ్‌కు బయలుదేరిన ప్రత్యేక రైలు చాలా వరకు ఖాళీగా వుంది. వారం మధ్యలో కావడం, తగిన ప్రచారం లేకపోవడంతో ప్రయాణికులు అంతగా లేరు. మధ్యాహ్నం 1.15 గంటలకు 22 బోగీలతో బయలుదేరిన ఈ రైలులో 13 ఏసీ బోగీలు కాగా ఆరు మాత్రమే స్లీపర్ క్లాస్ బోగీలు ఉన్నాయి. రెండు గార్డు బోగీలు, ఒక ప్యాంట్రీ కార్ బోగీ ఉన్నాయి. జనరల్ బోగీలు ఒక్కటి కూడా లేకపోవడంతో తుని, రాజమహేంద్ర వరకు వంటి తక్కువ దూరం ప్రాంతాలకు ప్రయాణించే వారు నిరాశ చెందారు. సెకండ్ క్లాస్ జనరల్ టికెట్ తీసుకున్న ప్రయాణికులు ఈ రైలు ఎక్కకుండా తరువాత వచ్చే రైళ్ల కోసం ప్లాట్ ఫారంపై నిరీక్షించారు. స్లీపర్ బోగీల్లో అంతంత మాత్రంగానే ప్రయాణికులు వుండగా, ఏసీ బోగీలు ఖాళీగానే వెళ్లాయి. కాగా ఈ ప్రత్యేక రైలు నవంబరు 26వ తేదీ వరకు ప్రతి బుధవారం అందుబాటులో ఉంటుందని స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్ తెలిపారు.


ఖాళీగా ఉన్న ఏసీ బోగీలు

జాబ్‌మేళాకు విశేష స్పందన


విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. డీవీఎస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ లో ఉద్యోగాలకు కాలేజీలో కంపెనీ హెచ్ ఆర్ శరత్, అజయ్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వంద మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 48మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ రమణాజీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ ఎస్‌వీ వాసు, వెల్ఫేర్ సొసైటీ మెంబర్ శ్యాంజీ, ప్రిన్సిపాల్ నాయుడు, దొరబాబు, వి. శ్రీను, కృష్ణవర్ధన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


చినపాచిలలో పొలాల నుంచి వరిదుబ్బును తీసుకొస్తున్న గ్రామస్థులు

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):మండలంలో చినపాచిల గ్రామంలో గౌరీ పరమేశ్వరుల అంకుర్పణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రచ్చబండ(పెదరాయి)వద్ద ఏటా ఏర్పాటు చేసి కార్తీ మాసం నెల రోజుల పాటు రోజు ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆనవాయితి. దీనిలో భాగంగా 10 ఏళ్ల లోపు వయస్సు గల బాలికతో గ్రామ పోలి మేరలు దాటి పొలాలనుంచి వరి దుబ్బును తీసుకొచ్చి గౌరీ పరమేశ్వరులను నెలకొల్పారు. మండల టీడీపీ అధ్యక్షులు కోమటి శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముచ్చకర్ల సూరిబాబు, కరెడ్ల దుర్గునాయుడు, సాసుబిల్లి కృష్ణారావు, కన్నబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

బుచ్చెయ్యపేట అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం సీతయ్యపేట జడ్పీ హైస్కూల్‌లో మండల కోఆర్డినేటర్ కుంచం బాలగణపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 17,18తేదీల్లో సీతయ్యపేట హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్న కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ అండర్ 14, అండర్ 17 విభాగాలలో ఎంపికలు నిర్వహిమని బాలగణపతి ఈ సందర్భంగా తెలిపారు. బాలురకు 17న, బాలికలకు 18 న ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమమలో ప్రధానోపాధ్యాయులు ఎ.సురేశ్, మాట్లాడుతు మండలంలో అన్ని పాఠశాలలనుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. మండలంలో అన్ని హైస్కూళ్ల వ్యాయామ ఉధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం: మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 17,18 తేదీలలో మండల స్థాయి క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్టు క్రీడాసారధి బి. కన్నంనాయుడు, ఎస్. అప్పలనాయుడులు తెలిపారు.ప్రతిభ కనపరచిన విద్యార్థులు డివిజన్, ఆ పై జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు.

రావికమతం:ఈనెల 17 నుంచి18 వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించ నున్నామని స్థానిక జడ్పీ హైస్కూల్ పీఈటీ కె. ధనుంజయరావు తెలిపారు. కబాడీ, కోకో, వాలీబాల్, సెటిల్‌బ్యాట్‌మెంట్,చెస్, యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

మద్యం నాణ్యత నిర్ధారణకు సురక్ష యాప్: ఎక్సైజ్ సీఐ


ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు

చోడవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఎక్సైజ్ సురక్షా యాప్‌ను వినియోగదారులు ఉపయోగించుకోవాలని స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు బుధవారం తెలిపారు. దుకాణంలో సీసీ బాటిల్ మూతపై ఉన్న హీల్ లేదా క్యూ ఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి మద్యం తయారైన తేదీ, ఏ డిపో నుంచి వచ్చింది తదితర పూర్తి వివరాలు లభ్యమవుతాయని చెప్పారు. దీని వల్ల నాసిరకంగా కాదో తెల్సుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్టు చెప్పారు. దీనిపై వినియోగదారులకు ఎలాంటి సందేహాలున్నా స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి పూర్తి సమాచారం పొందవచ్చని సీఐ వివరించారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ర్యాలీ



మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే బుధవారం నిర్వహించారు. పెదబొడ్డేపల్లిలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీవో రమాదేవి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, పరిసరాలు పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. భోజనం చేసే ముందు పిల్లలు చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంతోమందికి రాజకీయ భిక్ష పెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, టీడీపీ నాయకులు

చీడికాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతోమంది నాయకులకు రాజకీయభిక్ష పెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకే దక్కుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని బి.సింగవరం, అప్పలరాజుపురం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటుచేయడం ఆనందదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1982లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటుచేసి రాష్ట్ర అభివృద్ధికి ఎన్టీఆర్ కంకణం కట్టుకున్నారు. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారాలోకేశ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. 2029 ఎన్నికల్లోను దేశ ప్రధానిగా నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నపుడే మరింత ప్రగతి సాధ్యమన్నారు. కోనాం నుంచి వీఆర్‌ఆర్.పేట రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్ పదవులు టీడీపీ మద్దతుదారుల గెలుపునకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే బి.సింగవరం గ్రామంలో కల్యాణమండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, గూనూరు మల్లునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడులు మాట్లాడారు.

టీడీపీ నాయకుడు శ్రీనుకు ఘన నివాళి

అప్పలరాజుపురానికి చెందిన టీడీపీ నాయకుడు కురచా శ్రీను ఇటీవల మృతిచెందడంతో ఆయన మృతికి కొంతసేపు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురచా శేషు, గవిరెడ్డి శ్రీను, కురచా సురేష్, చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు గవిరెడ్డి జగన్నాథం, శరగడం శివ, గాడి చెల్లంనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరగడం లక్ష్మి, నాయకులు పంచాడ దాలెంనాయుడు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, గండి ముసలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెం కాలనీలో సర్వేపై ఆందోళన

▸▸ పునరావాసం కల్పించిన 17ఏళ్ల తర్వాత చేపట్టడడంతో కాలనీవాసులు అసహనం


అధికారులను ప్రశ్నిస్తున్న తామరం పీఏసీఎస్ డైరెక్టర్, బాధితులు

మాకవరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపాలెం ఆర్‌ఆర్ కాలనీలో సర్వే చేయడంపై నిర్వాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ఏర్పాటుచేసి గత 17ఏళ్లలో సర్వే చేపట్టలేదని.. ఇప్పుడే ఎందుకు సర్వే చేస్తున్నారంటూ అనుమానం వ్యక్తంచేస్తున్నారు.మండలంలో 2007 అన్‌రాక్ భూసేకరణలో ఈ ప్రాంతంలో కొత్తపాలెం, ధర్మవరం, జి.వెంకటాపురం, జి.కోడూరు, రాచపల్లి, రామన్నపాలెం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి గ్రామాల్లో సుమారు 2,450 ఎకరాల భూసేకరణ చేశారు. అయితే, కొత్తపాలెంలో భూములు ఇళ్లు కోల్పోవడంతో 2010లో తామరం రెవెన్యూలో సుమారు 150 ఎకరాల ప్రభుత్వ భూమిలో 145మందికి పునరావాస కాలనీ కల్పించారు. అయితే, అప్పట్లో కొంతమందికి ఇళ్లను నిర్మించారు. మరికొంత మంది స్థలాలను ఖాళీగా ఉంచుకుని బతుకు తెరువు కోసం ఇతర జిల్లాలకు వలస వెళ్లిపోయారు.అయితే ఇక్కడ పలు మార్లు కొంత మంది తహశీల్దార్లు పోర్జరీ సంతకాలు సృష్టించి కొన్ని స్థలాలు కాజేశారు. పత్రికల్లో కథనాలు వచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. అయితే, ఈ కాలనీ మెడికల్ కాలేజీకి ఆనుకుని ఉండటం, కూటిమి ప్రభుత్వం కళాశాల పనులు ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఈకాలనీపై కొందరు పెద్దలు కన్ను వేశారు. దీంతో అధికార బలం చూపి ఇళ్ల స్థలాలను సర్వే చేయిస్తున్నట్టు ఇక్కడ ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం కాలనీలో సర్వే సమాయత్తం కావడంపై ఆందోళన వ్యక్తంచేశారు. సర్వే ఎవరు చేయమన్నారు.. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నాటి నుంచి నేటి వరకూ దరఖాస్తులు చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఇంత హఠాత్తుగా సర్వే ఏమిటని రెవెన్యూ సిబ్బందిని తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు అడిగర్ల రాంబాబు ప్రశ్నించారు. ఆర్‌డీవో, తహసీల్దార్ సర్వేకు ఆదేశించిన రెవెన్యూ సిబ్బంది సమాధానం ఇచ్చారు.

'వారసత్వ భూమికి హక్కులు కల్పించాలి'

మాకవరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారసత్వం ద్వారా వచ్చిన భూమికి హక్కులు కల్పించాలంటూ సన్నిది శ్రీనివాసరావుతో పాటు మరో 20మంది నాయీ బ్రహ్మణ మహిళలు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల తామరం 61/3 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని రాచపల్లి గ్రామానికి చెందినవారు ఆక్రమించేందుకు ప్రయత్నించగా, రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి రాచపల్లి గ్రామానికి చెందిన పేరయ్య అనే వ్యక్తి సాగుచేసేవారని, ఈ భూమి తమది అంటూ కొందరు వ్యక్తులు బుధవారం భూమిలోకి వెళ్లారు. దీంతో భూమిలో పూర్వ నుంచి తామే సాగులో ఉన్నామని నాయీ బ్రహ్మణులు అన్నారు. హక్కులు కల్పించాలని తహసీల్దార్ బి.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బోంతురమణ పాల్గొన్నారు.

బత్తులకు సత్యసాయి జయంతి వేడుకల ఆహ్వానపత్రిక

బుచ్చెయ్యపేట అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాదిలో శ్రీ సత్యసాయి జన్మదినవేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రికను టీడీపీ నేత బత్తుల తాతారావుకు జోన్- 5 ఇన్‌చార్జి బి లోవరాజు ,టి నూకరాజు భగవాన్ మస్తారు, ఎస్ నాగరాజు బుధవారం అందచేశారు. నవంబర్23న జరిగే సాయిబాబాజయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

పశువులకు గర్భకోశ వైద్య పరీక్షలు

దేవరాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వంద పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్టు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి బి.రామ్మోహన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ దూడలు మాత్రమే పుట్టేలా లింగ నిర్ధారణ వీర్యం(ఎస్.ఎస్‌ఎస్) అందుబాటులో ఉందన్నారు. కెకోటపాడు ఏడీ దినేష్‌కుమార్, పశు వైద్యాధికారులు సౌజన్య, మంజుషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి రుణాలు మంజూరు


రైతులకు రుణాలు అందచేస్తున్న చైర్‌పర్సన్ కోట సత్యనారాయణ

బుచ్చెయ్యపేట అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురకలపూడి పీఏసీఎస్‌లో బుధవారం రైతులకు పెట్టుబడికి రబీ సీజన్‌కు వీలుగా రుణాలు మంజూరు చేశారు. చైర్‌పర్సన్ కోట సత్యనారాయణ 15 మందికి రూ. 20 లక్షలు అందించారు. మరో 30 లక్షలు మార్ట్‌గేజ్ ద్వారా భూములు తనఖా పెట్టురేపి రుణాలు మంజూరు చేసారు. ఈ కార్యక్రమంలో రావికమతం బ్రాంచి మేనేజర్ కరణం నారాయణమూర్తి , ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను, తురకలపూడి పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

గొలుగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం సీడీపీఓ రమణ బుధవారం రామలక్ష్మీపురంలో ఒకటి, పెదబొడ్డేపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అందిస్తున్న సేవలను పరిశీలించారు. హోమ్‌విజిట్ చేసి గర్భిణు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి: పీడీ


15కేకేపీ-2- కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పూర్తి స్థాయి పనుల కల్పనకు వీలుగా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ - ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని చంద్రయ్యపేట, కె. సంతపాలెం, ఆర్లే, ఆనందపురం, ఏ భీమవరం, ఎల్‌వీ పాలెం, దాలివలస గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2024-25లో రూ. 22 కోట్లతో 1392 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో 1154 పనులు గ్రామాల్లో చెరువులు, కాలువలు తదితర మట్టి పనులు పూర్తి చేసినట్టు చెప్పారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ. 6.25 లక్షలతో 19 పనులు, సామాజిక అటవీ పథకంలో 10 నర్సరీలకు రూ. 25 లక్షలు, పాఠశాలల ప్రహరీలకు రూ. 85 లక్షలతో 37 పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ విజిలెన్స్ అధికారిణి దేవి శ్రీలలిత, ఎస్డీఎం సత్యనారాయణ, ఎస్ఆర్పీ చిరంజీవి, స్థానిక ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు


వూషు పోటీలలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వూషూ పోటీలలో సోషల్ వెల్ఫేర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. మంగళ, బుధవారాలలో రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల వూషూ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అంబేడ్కర్ గురుకులానికి చెందిన పరవాడ జోష్నమేరి, వేంపేటి ప్రణీత స్వర్ణ పతకాలు సాధించారు. పెంట దుర్గా భవాని సిల్వర్ మెడల్, వెన్నెల కావ్య బ్రాంజ్ మెడల్ సాధించినట్టట శాప్ కోచ్ అబ్బు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు నెలాఖరులో మణిపూర్‌లో జరిగే 69వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వాకర్స్

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ, అంతరిక్ష పరిశోధన సంస్థలో అబ్దుల్ కలాం ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. యువత ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎంవీ రంగారావు, ట్రెజరర్ అల్లు అప్పారావు, ఆళ్ల వరప్రసాద్, లోకా లోవరాజు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

మాడుగుల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొంగలిపాక గ్రామంలో బుధవారం కూటమి నాయకులు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఇంటింటికి, చిరు వ్యాపారులకు వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉండూరు దేముడు, కూటమి నాయకులు సత్తిబాబు, జోగినాయుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోనాం రేషన్ డిపోపై 6ఏ కేసు నమోదు

చీడికాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం రేషన్ డిపోపై 6ఏ కేసు నమోదుచేసినట్టు సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ రవిబాబు తెలిపారు.మంగళవారం సాయంత్రం ఈ డిపోను స్థానిక వీఆర్‌వో లక్ష్మీకుమార్‌తో కలిసి తనిఖీచేయగా 625కిలోల బియ్యం, 49పంచదార ప్యాకెట్లు అదనంగా ఉన్నాయన్నారు. రికార్డుల్లో లోపాలను గుర్తించామన్నారు.దీనిపై 6ఏ కేసు నమోదు చేసి, మంచాల రేషన్‌డిపో డీలర్ కె.హేమసుందర్‌కి ఇన్‌చార్జిగా నియమించామని ఆయన తెలిపారు.

బాణసంచా దుకాణాలకు 38 దరఖాస్తులు


పెద్దచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : బాణ సంచా దుకాణాలకు 38 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ లోకవరపు రామారావు తెలిపారు. బుధవారం ఆయన నర్సీపట్నంలోని పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా తనిఖీ చేశారు. ఫైర్‌ఆఫీసర్ అప్పలస్వామి దుకాణాల ఏర్పాటులో తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టైన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ఆర్ఐ నాయుడు పాల్గొన్నారు.

కాలువకు గండి, నీట మునిగిన పంటలు


కలిగొట్ల వద్ద కాలువకు గండి

దేవరాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు నీరందించే కుడి ప్రధాన కాలువకు సోమవారం అర్ధరాత్రి గండి పడింది. దీంతో పదిఎకరాల్లో వరి, సరుగుడు తదితర పంటలు ముంపునకుగురయ్యాయి. తారువ ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన మదుం ద్వారా దిగువ ఆయకట్టుకు ఈ కాలువద్వారా 50 క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నారు. ఈ ఆనకట్టకు అర కిలోమీటరు దూరంలో కాలువ ఎడమ గట్టుకు సుమారు 50 మీటర్ల బారీ గండి పడింది. దీంతో ఈ నీరంతా కాలువ ఆనుకొని ఉన్న పొలాలు ముంచేసింది. మరికొంత శారదానదిలో కలిసిపోతోంది.జ జలవనరుల శాఖ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.


నీటితో మునిగిన పొలాలు

ఆర్థిక ఊబి నుంచి అభివృద్ధి పథంలోకి..

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడంతోపాటు అభివృద్ధి పథంలో సాగేలా ముందుకు నడిపిస్తోందని ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని ఎమ్మెల్యే బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గుడ్డిపలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి భూమి పూజ చేశారు. మండలంలో వివిధ గ్రామాల్లోని 24 మంది పక్కా గృహ లబ్ధిదారులకు ఫ్యాన్లు, ఎల్ఈడీ బల్బులు ఎంపిపీ పైల రాజుతో కలసి పంపిణి చేశారు. రూ. 1.16 కోట్లతో నూతనంగా నిర్మించిన సివిల్ సప్లెయి గోదాంను ఎమ్మెల్యే ప్రారంభించారు. గర్నికం పంచాయతీ శివారు కానాడ గ్రామానికి రూ.1.24 కోట్లతో నిర్మించనున్న కిలో మీటరున్న తారురోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. గర్నికం కేజీబీవీలో అదనంగా రూ.69 లక్షలతో ల్యాబ్ రూమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గర్నికం సివిల్ సప్లై గోదాం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వం దీనిని పూర్తి చేయలేదన్నారు. పదేళ్ళ తరువాత మళ్లీ ఈ గొడౌన్‌ను పూర్తి చేసి, తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉందన్నారు. ఈ గోదాం చుట్టూ లారీలు తిరిగేలా కేటాయించిన స్థలం హద్దులు నిర్ధారణ చేయాలని, ప్రహారీ నిర్మించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు, మాజీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, వేపాడ నాగేశ్వరావు డీలర్ల సంఘ అధ్యక్షులు కోట గోవిందరావు, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ పి. జయంతి, ఎంపీడీవో మహేష్, తహసీల్దార్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ

కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోతున్నాయని, ఈస్థిలో భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీదేనని మాడుగుల నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు అన్నారు. బుధవారం కె.కోటపాడు రెల్లివీధిలో ఏర్పాటు చేసిన ఓట్ చోరీ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యేసు రాజు, కె. కోటపాడు, చీడికాడ మండలాల నాయకులు వడ్డాది కోటేశ్వరరావు, పరదేశి, కార్యకర్తలుపాల్గొన్నారు.

దేవరాపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీ అవగాహన సంతకాల సేకరణ బుధవారం జరిగింది. సుమారు వంద మందిని కలసి సంతకాల సేకరించారు. నియోజక వర్గ ఇన్‌చార్జి పడాల్ కొండలరావు, మండల అధ్యక్షుడు బంగార్రాజు, నాయకులు కోటి, పరిదేశి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అక్రమాలపై విచారణ వేగవంతం చేయండి


చైర్‌పర్సన్ బలిజి మహారాజ్‌తో సమావేశమైన రైతులు

రోలుగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై విచారణ వేగవంతం చేయాలని చేచల చే సంఘ సభ్యులు కిల్లాడ సాంబమూర్తినాయుడు, గొల్లునారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు,పి.శ్రీనివాసరావు తదితరులు చైర్‌పర్సన్ బలిజి మహారాజ్‌ను కోరారు. బుధవారం పీఏసీఎస్‌లో సమావేశమయ్యారు. గతంలో జరిగిన నిధుల స్వాహాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గత జనవరిలో ఆయన ఆదేశాలిచ్చినా విచారణ జరపకుండా మధ్యలోనే నిలిపివేశారన్నారు. సస్పెండ్ అయిన పూర్వ సీఈఓపై చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేయాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

గొలుగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం పాకలపాడు హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ డి. సత్యవతి మాట్లాడారు. లింగ నిర్ధారణ జరగకుండా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని వివరించారు.

నిర్బంధంపై ఆందోళనలు

చోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమకారులపై పోలీసులు అక్రమ నిర్బంధంపై బుధవారం స్థానిక కొత్తూరు జంక్షన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడారు. నాయకులు గూనూరు వరలక్ష్మి, ఎస్‌వీ నాయుడు, గణేశ్, దేవి, అప్పారావు పాల్గొన్నారు.

రావికమతం: సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు వి. సత్యవతి ఆధ్వర్యంలో రావికమతం, గర్నికం,చీమలపాడు, పి.కొట్నాబిల్లి గ్రామాలలో నిరసనలు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.గోవిందరావు, గిరిజన సంఘ జిల్లా నేత గెమిలి వాసు, కేవీపీఎస్ నేత సీహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దుచేయాలని ఉద్యమంపై కార్మికుల నిర్బంధాన్ని ఖండించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోనాం జంక్షన్‌లో గిరిజనులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద బల్క్‌డ్రగ్ పార్కును వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బొబ్బాది నాగరాజు, కన్నూరు రమణ, చిలకమ్మ, గంగమ్మ, కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో భూసారం పెంపు

రోలుగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవన ఎరువుల వాడకంలో రైతులు అవగాహన పెంచుకోవాలని కొండెంపూడి కృషివిజ్ఞాన శాస్త్రవేత్తలు డా.సౌజన్య, డా.రాజ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం శరభవరంలో జీవన ఎరువుల వాడకంలో అవగాహన వారోత్సవాల్లో భాగంగా , క్షేత్ర పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ భూ సారవంతానికి అజోస్పైరిల్లమ్, పోటాష్ అందించే పోటాష్ రీలిజింగ్ బాక్టీరియా తదితర జీవన ఎరువులను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ చిరంజీవి, ఏడీఏ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

▸▸ సంబరాల్లో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



సంబరాల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద

తుమ్మపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రానున్న నేపథ్యంలో ఇక్కడి టీడీపీ కార్యాలయంలో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. తొలుత బాణసంచా కాల్చి కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బుద్ద మాట్లాడుతూ దేశంలోనే 15 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. నాడు హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్, నేడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. ఈ సెంటర్ ద్వారా 12 దేశాలకు నేరుగా కంప్యూటర్ డేటా పంపేందుకు అవకాశం ఉంటుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పడుతుండడంతో ప్రపంచం చూపు విశాఖ వైపు మళ్లుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, బోడి వెంకటరావు, కర్రి గోపి, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి : పీలా



కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న పీలా గోవింద

తుమ్మపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్టు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాకవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్‌లు వద్దని వినతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు టీడీఆర్‌లు వద్దని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల సంఘం ప్రతినిధులు, సీపీఎం నాయకులు బుధవారం ఆర్డీవో షేక్ అయిషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని గ్రామ సభలు నిర్వహించి, ఇప్పుడు టీడీఆర్‌లు ఇస్తా మనడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, కె.రామసదాశివరావు, కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో జోనల్ కమిషనర్ విస్తృత పర్యటన



మెయిన్ రోడ్డులో డివైడర్‌పై ఉన్న ఫ్లెక్సీని తొలగింపజేస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి బుధవారం విస్తృతంగా పర్యటించారు. రింగురోడ్డు జంక్షన్‌లోని ఫుట్‌పాత్‌పై వృథా భవన నిర్మాణ మెటీరియల్ వేయడాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణ యజమానిని పిలిపించి తక్షణమే తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో షాపు యజమానికి జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. అలాగే మెయిన్ రోడ్డులోని డివైడర్‌లపై ఉన్న ఫ్లెక్సీలను కూడా దగ్గరుండి తొలగింపజేశారు. అన్న క్యాంటీన్‌లను పరిశీలించి అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఉదయం చెత్తను తరలించే పనులను పరిశీలించి, పట్టణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సిబ్బందికి సూచించారు.

'ఆరోగ్యశ్రీ పథకం నిర్వహణకు చర్యలు చేపట్టాలి'



మాట్లాడుతున్న భద్రం

తుమ్మపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేదల పాలిట ఆరోగ్య ప్రదాయిని అయిన ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా నాయకుడు వై.ఎస్.భద్రం కోరారు. బుధవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రోగ్యశ్రీ పథకం ఆరు రోజులుగా నిలిపివేయడం దారుణమన్నారు. దీంతో పలు రోగాలతో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని ఆయన కోరారు. నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకరరావు, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలపాకలో మూలకు చేరిన ఆర్‌వో ప్లాంట్

పరవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలపాకలో ఆర్‌వో ప్లాంట్ మూలకు చేరింది. గ్రామస్థులకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12 లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 1500 మంది దీనిని వినియోగించుకునేవారు. పంచాయతీ అధికారులకు దీని నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఇరవై లీటర్ల క్యాన్ ఐదు రూపాయలకే విక్రయించేవారు. ప్రస్తుతం ఇది కొన్నేళ్లుగా మరమ్మతులకు గురై మూలకు చేరినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. గత్యంతరం లేక స్వచ్ఛమైన తాగునీటి కోసం సమీపంలో గల గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పంచాయతీ అధికారులు దీనిని వినియోగంలోకి తీసుకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలకు చక్కని పరిష్కారం

▸▸ 'సీజీఆర్ఎఫ్' ద్వారా సాధ్యం ▸▸ సంస్థ చైర్‌పర్సన్, రిటైర్డు జిల్లా జడ్జి డాక్టర్ సత్యనారాయణ వెల్లడి ▸▸ సబ్బవరంలో వినతుల స్వీకరణ



వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ

సబ్బవరం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చక్కని వేదికని ఆ సంస్థ చైర్‌పర్సన్, రిటైర్డు జిల్లా జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. ఇక్కడి ఏపీఈపీడీసీఎల్ సెక్షన్-డి1 కార్యాలయం ఆవరణలో ఈఈ ఎస్.రామకృష్ణ అధ్యక్షతన బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఒక కోర్టు ఉందన్న విషయం చాలా మందికి తెలియదన్నారు. ఈ కోర్టు 2005లో ఏర్పాటైందని, నాటి నుంచి అనేక సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలను టోల్‌ఫ్రీ నెంబరు 1912కు కాల్ చేయడం లేదా వాట్సాప్, ఫోన్, మెయిల్, పోస్టు ద్వారా తెలపవచ్చునన్నారు. వినియోగదారులు కోర్టు దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను అరవై రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. 2020 నుంచి 2025 వరకూ 1047 సమస్యలు కోర్టు దృష్టికి రాగా, 878 పరిష్కరించడం జరిగిందన్నారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిన ఆరు గంటల్లోగా సరఫరాను పునరుద్ధరించాల్సిన బాధ్యత ఆ సంస్థదేనన్నారు. దరఖాస్తు చేసుకున్న పదిహేను రోజుల్లో కనెక్షన్ ఇవాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజీ, హై ఓల్టేజీ సమస్యలు, కొత్త కనెక్షన్ జారీలో జాప్యం, మీటర్‌లో లోపాలు, సర్వీస్ లోపాలు, రీ కనెక్షన్ సమస్యలు, కనెక్షన్ మార్పు, బిల్లులో తప్పులు, కాలిపోయిన మీటర్లు తదితర సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకు నెలకు రెండు వందల యూనిట్లు, కుల వృత్తివారలకు 150 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని వివరించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎస్.రామకృష్ణ, డీఈ ఎన్.సురేష్, ఏఈఈ ఎం.దుర్గాప్రసాద్, కాండ్రేగుల సూర్యనారాయణ తదితర అధికారులతో పాటు వినియోగదారులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



కలాం విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు అంజలి



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న రత్నాకర్, తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉడ్‌పేటలోని కలాం విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొణతాల సత్యనారాయణ, దాడి వీరునాయుడు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, కర్రి చినఅప్పలనాయుడు, కోటిపల్లి శ్రీను పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగభూషణం సంస్థ ప్రతినిధులతో కలిసి పూలమాలవేసి అంజలి ఘటించారు.

కొత్తూరు : అబ్దుల్ కలాం జయంతిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి పట్టణం జార్జిక్లబ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశానికి కలాం జీవితాన్ని అంకితం చేశారన్నారు. జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం బాషా, బీజేపీ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, కర్రి రామకృష్ణ, ఈశ్వరరావు, మారిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏఎంఏఎల్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్రను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఎన్ఎస్ఎస్ అధికారులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శమని ఎంఈవో-2 రవీంద్రబాబు అన్నారు. జయంతి సందర్భంగా మండలంలోని గొటివాడ ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు గీసిన కలాం చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీవీ ఆనంద్, ఉపాధ్యాయులు, కార్యదర్శి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా ప్రేమ్‌కుమార్ బాధ్యతలు



ప్రేమ్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సీఐగా జి.ప్రేమ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా మంప, సీలేరు, పాయకరావుపేట ప్రాంతాల్లో పనిచేసి 2018లో పదోన్నతి పొందారు. అనంతరం ఏసీబీ, పాడేరు, విశాఖనగరం, అనకాపల్లి టాస్క్‌ఫోర్స్‌లలో పనిచేశారు. టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న ప్రేమ్‌కుమార్‌ను డీఐజీ అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు నియమించడంతో బుధవారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ టీవీ విజయ్‌కుమార్‌ను విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

లంకెలపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు గుర్రం మణికంఠ, లీలాసాగర్, వరప్రసాద్‌లు క్రీడా పోటీలకు హాజరు కానున్న పదిహేను మంది విద్యార్థులకు బుధవారం క్రీడా దుస్తులు సమకూర్చారు. ఈమేరకు వీటిని ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా వామపక్షాల ఆందోళన



పరవాడలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కశింకోట/పరవాడ/అనకాపల్లి టౌన్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి మండలం రాజయ్యపేటలో పర్యావరణానికి, ప్రజలకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దంటూ సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు బుధవారం తాళ్లపాలెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని చేస్తున్న ఉద్యమంపై నిర్బంధాన్ని ఖండించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, , నాయకులు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే, బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేయాలంటూ పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కార్య వర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, బి.శ్రీను, సత్తిబాబు, జి.అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకుల సమా వేశాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కులోని పరిశ్రమల నుంచి వెలువడే పారిశ్రామిక రసాయన వ్యర్థాలను సముద్రంలోకి విడుదల చేసేందుకు మెరైన్ ఔట్‌ఫాల్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. పార్కు నిర్మాణ పనులకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేవని, తక్షణమే రద్దు చేసి మత్స్యకారుల జీవనోపాధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై వివాహిత హత్య

▸▸ ఎదురింట్లో ఉండే వ్యక్తి ఘాతుకం ▸▸ విచక్షణ కోల్పోయి పదునైన ఆయుధంతో పీక కోసేసిన నిందితుడు



శ్రావణ సంధ్యారాణి (ఫైల్)

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో పట్టపగలు నడిరోడ్డుపై ఒక వివాహిత హత్యకు గురైంది. ఆమె నివాసానికి ఎదురు ఇంట్లో ఉండే వ్యక్తే పదునైన ఆయుధంతో గొంతుకోసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే హత్య జరగడంతో ఆ ప్రాంతంలో తీవ్రకలకలం రేపింది. అక్కయ్యపాలెం నందగిరి నగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రావణ సంధ్యారాణి అలియాస్ సోనూ (32) నందగిరి నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటుంది. సోనూకు ఎనిమిదేళ్ల వయస్సు గల ఇద్దరు (కవలలు) కుమారులు ఉన్నారు. ఇద్దరూ మానసిక వైకల్యంతో పుట్టడంతో శ్రావణ సంధ్యారాణి భర్త ఆమెను, పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై ప్రస్తుతం ఇద్దరి మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. శ్రావణ సంధ్యారాణి తండ్రి విశ్వేశ్వరరావు పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తర్వాత మృతిచెందగా, తల్లి కూడా కొన్నాళ్ల క్రితం మృతిచెందారు. శ్రావణ సంధ్యారాణి ఒక కుమారుడిని హాస్టల్‌లో చేర్పించగా, మరొక కుమారుడు ఆమెతోనే ఉంటున్నాడు. ఇదిలావుండగా శ్రావణ సంధ్యారాణికి, ఆమె ఎదురింట్లో ఉంటున్న కార్పెంటర్ కండిపల్లి శ్రీనివాసరావు(36)కు కొద్దిరోజులుగా గొడవ జరుగుతోంది. బుధవారం మధ్యాహ్నం కూడా ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. సాయంత్రం 5.15 గంటల సమయంలో శ్రావణ సంధ్యారాణి వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. కొద్దిఅడుగుల దూరం వెళ్లేసరికి కొండమ్మ అనే మహిళ ఎదురుపడడంతో ఆమెతో మాట్లాడుతోంది. ఇంతలో వెనుక నుంచి వచ్చిన శ్రీనివాసరావు పదునైన ఆయుధంతో శ్రావణ సంధ్యారాణి మెడ కోసేశాడు. దీంతో ఆమె తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. సంధ్యారాణితో మాట్లాడుతున్న మహిళ గట్టిగా కేకలు పెట్టింది. స్థానికులు అక్కడకు వచ్చేసరికి శ్రీనివాసరావు పరారైపోయాడు. స్థానికులు డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఫోర్త్ టౌన్ సీఐ సీహెచ్ ఉమాకాంత్ అక్కడకు చేరుకుని 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

క్లూస్‌టీమ్‌ను రప్పించి ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంధ్యారాణికి ఒక సోదరుడు ఉన్నప్పటికీ అతను అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. తమ అనేవారు ఎవరూ లేకపోవడంతో బుద్ధిమాంద్యం కలిగిన ఇద్దరు కవలల పరిస్థితి ఏమిటనేది అగమ్యగోచరంగా మారింది. వారిని తండ్రి వద్దకు చేర్చేలా పోలీసులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పార్టనర్ షిప్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణ

▸▸ వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహణ : జేసీ జాహ్నవి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి, తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఐఐ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో పార్టనర్ షిప్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి తెలిపారు. బుధవారం ఇక్కడి కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ చాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాము ప్రతిభ



పతకాన్ని చూపుతున్న ఏవో రాము

అనకాపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : హాంకాంగ్‌లో జరుగుతున్న ఏషియన్ చాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి రాము ప్రతిభ చాటారు. ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 120 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను అనకాపల్లి మండల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవోకు ధర్నా నోటీస్

అనకాపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. ఈ మేరకు బుధవారం డీఈవో పెన్నాడ అప్పారావును కలిసి ఇందుకు సంబంధించిన ధర్నా నోటీసును అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వాత్సవాయి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

లంకెలపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 18 వరకు మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నట్టు పరవాడ మండల ఎస్‌జీఎఫ్ కో- ఆర్డినేటర్ తెలిపారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం అథ్లెటిక్స్ పోటీలు, 17న ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి హైస్కూల్ మైదానంలో ఖోఖో, కబడ్డీ, 18న పరవాడ ఇండోర్ స్టేడియంలో షటిల్ బాడ్మింటన్ పోటీలు, ముత్యాలమ్మపాలెం హైస్కూల్ మైదానంలో వాలీబాల్, చెస్, యోగా పోటీలను నిర్వహిస్తామని చెప్పారు.



రేవుపోలవరంలో మత్స్యకారుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

ఎస్. రాయవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్స్ పార్కుకు వ్యతిరేకంగా స్థానిక మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా మండలంలోని రేవుపోలవరంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకారులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 32 రోజులుగా బల్క్ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించకపోడం దారుణమన్నారు. బల్క్ డ్రగ్స్, హెట్రో డ్రగ్స్ విషయంలో హోం మంత్రి అనిత అధికారంలో లేనప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చిన తరువాత ఒక మాట ఆడుతున్నారని మండిపడ్డారు.

ధనిశెట్టినగర్‌లో చోరీ

- తులంన్నర బంగారం, 5 తులాల వెండి, రూ.5వేలు అపహరణ

పాయకరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థా నిక ధనిశెట్టినగర్‌లో ఒక ఇంట్లో చోరీ జరిగింది. తు లంన్నర బంగారం, 5 తులాల వెండి, రూ.5వేల నగదు దోచుకువెళ్లారు. బుధవారం బాధితుడు రా జాపు నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి.. ధని శెట్టినగర్‌లో నివాసముంటున్న తాము మూడు రోజుల కిత్రం కాకినాడలో ఉంటున్న తన పెద్ద కుమారుడు గృహప్రవేశం కార్యక్రమానికి వెళ్ళి అక్కడే ఉన్నారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధనిశెట్టినగర్‌లో తాము నివాసముంటున్న ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలో ఉన్న బంగారం, వెండి, రూ.5 వేలు చిల్లర నగదు అపహరించుకుపోయారని నాగేశ్వరరావు తెలిపారు. బుధ వారం ఉదయం చోరీ జరిగిన విష యం పక్క ఇంటివారు సమాచారం ఇవ్వడంతో కాకినాడనుంచి వచ్చి పోలీ సులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.


పగులగొట్టిన ప్రధాన ద్వారం తలుపు








నక్కపల్లి సీఐగా మురళి



నక్కపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి నూతన సీఐగా జె.మురళీని నియమితులయ్యారు. బల్క్ డ్రగ్ ఉద్యమం, వివాదాల నేపథ్యంలో ఏడాదిగా ఇక్కడ పనిచేస్తున్న కె.కుమారస్వామిని బదిలీ చేసి, వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో విశాఖ రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న సీఐ జె.మురళీని నక్కపల్లికి నియమించారు. ఈ మేరకు బుధవారం పోలీసుఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.





రీ-సర్వే పరిశీలన

ఎస్. రాయవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే కార్యక్రమాన్ని బుధవారం డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణ, నర్సీపట్నం డీఐఎస్ బంగారు దేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ అక్కడి చేపట్టిన రీ-సర్వేపై సంబంధిత రైతులను ఆరా తీశారు. సిబ్బందితో పాటు స్థానిక అధికారులకు డిప్యూటీ డైరెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేశ్‌బాబు, మండల సర్వేర్ ఏఎస్‌వీఎన్ మూర్తి పాల్గొన్నారు.





పోలీసు బలగాల మోహరింపు


రాజయ్యపేటలో పోలీస్ బలగాలు

నక్కపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఉద్యమం, హైవే దిగ్బంధం తదితర విషయాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై సీఎం సహా పలువురు మంత్రులు పోలీస్ అధికారుల విఫలం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వాస్తవానికి బుధవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ రాజయ్యపేట వెళ్లాల్సివుంది.

చెన్నైలోని వారి కుటుంబంలో జరిగే అత్యవసర కార్యక్రమానికి వెళ్లడం వల్ల ఆమె రాలేనని, ఆర్డీవో, డీఎస్పీ ద్వారా మంగళవారం గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ పెద్ద సంఖ్యలో పోలీస్ బలగాలను మోహరించారు. ఉపమాకలోని పలు జంక్షన్లు, రాజయ్యపేటకు వెళ్లే పలు కూడళ్లు, ఆ గ్రామంలో ఎక్కడ చూసినా పోలీస్ బలగాలే కన్పిస్తున్నాయి. పలువురు సీఐలు, ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మత్స్యకారుల నిరసన శిబిరాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావ్ కూడా సందర్శించి, వారికి మద్దతు ప్రకటించారు.









గూగుల్ డేటా సెంటర్ ప్రపంచానికే తలమానికం

'పేట'లో టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ

పాయకరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఐటీ దిగ్గ జం గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటవుతున్న సందర్భంగా బుధవారం కూటమి నాయకులు, విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ళ వరహాలబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖా మంత్రి లోకేశ్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు బొంది కాశీవిశ్వనాధం, చిక్కాల శ్రీని వాస రావు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీను, పల్లా విలియంకేరి, మలిపెద్ది వెంకట రమణ, సూరా సుబ్రహ్మణ్యం, గొల్లపల్లి నాగు, రాజాన ఆది, టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: ప్రపంచ దేశాలు నివ్వెరపోయేలా గూగుల్ సంస్థ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదరడం చారిత్రాత్మక పరిణామమని టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. ఈ ఘనత సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందన్నారు. బుధవారం నక్కపల్లిలో కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, పీఏసీఎస్ ఛైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల: గూగుల్ రాకతో విశాఖ డేటా హబ్‌గా మారనుందని టీడీపీనేతలు హర్షం వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల అధక్షులు పెట్ల లింగంనాయుడు ఆధ్వర్యంలో ప్రధాని మంత్రి మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీమంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు చెబుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు వేచలపు జనార్దన్, టీడీపీ నాయకులు జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పి. సూర్యారావు,సుంకర బాబ్జి, తిరుమల రావు, కోటి,తదితరులు పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో..

ఎస్. రాయవరం: మండలంలోని వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు జంక్షన్ వద్ద బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్, జై లోకేశ్ అంటూ నినాదాలు చేస్తూ అడ్డరోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరుకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడారు.


పాయకరావుపేటలో ర్యాలీ చేస్తున్న నాయకులు, విద్యార్థులు
































మహిళాభ్యుదయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

పోషణ మాసోత్సవంలో ఎమ్మెల్యే విజయకుమార్



మహిళలను సత్కరిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, చిత్రంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళాభ్యుదయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని గుర్రవప్ప కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించి తాంబూలాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు శ్రీను, మోటూరు గోపి, కరణం రవి, రాజాన నారాయణమ్మ, లాలం సోమునాయుడు, ఊటకూటి రమేష్ నాయుడు, కొఠారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్వాసితులకు న్యాయం చేయాలి

- 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి
- హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. రోడ్డు విస్తరణ నిమిత్తం సర్వే జరిపినప్పుడు భూనిర్వాసితులు తమ అభిప్రాయాలను తెలిపారన్నారు. టీడీఆర్ బాండ్లు వద్దని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం నగదు రూపంలో చెల్లిస్తేనే తాము అంగీకరిస్తామని నిర్వాసితులు స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీలను ఆర్డీవోకి అందజేసినట్టు చెప్పారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు జి.కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, కాండ్రేగుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

17, 18న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

మునగపాక, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 17, 18 తేదీలలో అండర్-14, 17 పోటీలు వేర్వేరుగా జరగనున్నాయని ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, పీడీ బషీరుద్దీన్ తెలిపారు. అండర్-14 విభాగంలో 6, 7, 8 తరగతి విద్యార్థులు, అండర్-17 విభాగంలో 9,10 తరగతుల విద్యార్థులు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో తలపడనున్నారన్నారు. 17న బాలికలు, 18న బాలురు విభాగాల్లో జరుగుతాయని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మునగపాక, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మధ్యవీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. రెండు లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించినట్టు సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పనులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టెక్కలి రమణబాబు, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక మండల సమావేశం రేపు

మునగపాక, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు ప్రారంభం కానుందన్నారు. అధికారులు, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

పాఠశాలల్లో చెకుముకి సంబరాలు

మునగపాక, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు నాలుగు దశల్లో చెకుముకి పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈవో బుద్ధ శివనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఇక్కడ జనవిజ్ఞాన వేదిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.





CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **SANJAY AGARWAL** (Old Name) S/o. Babulal Agarwal, R/o: 50-112-26, TPT Colony, Visakhapatnam. Change my name from SANJAY AGARWAL (Old Name) To **SANJAY KUMAR AGARWAL** (New Name) hence forth I am Being Called as **SANJAY KUMAR AGARWAL** (New Name) all purposes.
AJV_251079

CHANGE OF NAME

★ I, **VASKA BANAGARUBABU** (Old Name) S/o. Vaska Yohanu, R/o :1-175, SC Peta, Lolla, Atreyapuram, East Godavari. Change my name from VASKA BANAGARUBABU (Old Name) To **VASKA BANGARUBABU** (New Name) hence forth I am Being Called as **VASKA BANGARUBABU** (New Name) all purposes.
AJV_251081

CHANGE OF NAME

★ I, **MAJJI JAYA LAXMI** (Old Name) W/o. Majji Apparao. R/o 2-43, Vijinigiripalem, Adavivaram, Chinagadili, Visakhapatnam. Change my name from MAJJI JAYA LAXMI (Old Name) To **MAJJI VARALAKSHMI** (New Name) hence forth I am Being Called as **MAJJI VARALAKSHMI** (New Name) for all purposes.
AJV_251080

LOST OF PASSPORT

★ I, **DASARI JAYARAM**, S/o. Dasari Suri Babu, R/o. D.No.17-150, Prahaladapuram, Opp. Sai Lakshmi Public School, Visakhapatnam - 530027. Lost my original **Passport No.M1947269**. While I am travelling by auto from Prahaladapuram to Pendurthi on 20-09-2025. If anyone found may please Contact : **9618198675**.
AJV_251082

CHANGE OF NAME

I, Shaik Shanaj Banu (old name), D/o. Ajeem Johny, residing at Flat No. 501, Sundeep Residency, P.M. Palem, Visakhapatnam, India, I have changed my name from Shaik Shanaj Banu to Shaik Shanaz Banu, Hereafter,my name is known as Shaik Shanaz Banu for all purposes.
AJB-1379

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి





'గూగుల్ రాకతో ఎనలేని అభివృద్ధి'

ఎలమంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కూటమి పాలన సాగుతున్నట్టు చెప్పారు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే వివిధ కంపెనీలు వస్తున్నట్టు వివరించారు. కూటమి నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, రాజాన నారాయణమ్మ, మోటూరు గోపి, వూటకూటి రమేష్, లాలం సోమునాయుడు, కరణం రవి తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



వరి దుబ్బును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎలమంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం, కట్టుపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వరి పొలాలను ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ భవానీ, బీసీటీ శాస్త్రవేత్త శ్రీహరి కలిసి పరిశీలించారు. పంటల సాగులో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏఈవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఎమ్మెల్యే



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

రాంబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. వెంటనే ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాంబిల్లి మండల మాజీ అధ్యక్షుడు వి.దినబాబు, జనసేన పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, దిమిలి మాజీ సర్పంచ్ కోటాపు వడికాసులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై ప్రచారం



కరపత్రాలను చూపుతున్న టీడీపీ నాయకులు

అచ్యుతాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని దిబ్బపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు లాలం రాజు అన్నారు. రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై బుధవారం గ్రామంలో ఇం టింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. అంతకుముందు పార్టీ కార్యాలయం వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బల్క్‌డ్రగ్'కు వ్యతిరేకంగా ఆందోళన



అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న నాయకులు

అచ్యుతాపురం/రాంబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో కాలుష్యకారక కర్మాగారాలు వద్దని సీఐటీయూ అచ్యుతాపురం మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, మత్స్యకార్మిక సంఘం నాయకుడు చేపల తాతయ్య అన్నారు. నక్కపల్లి మండలంలో చేపట్టనున్న బల్క్‌డ్రగ్స్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేపడుతున్న పోరాటానికి సంఘీభావంగా బుధవారం అచ్యుతాపురం జంక్షన్‌లో వీరు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్క్ వలన కాలుష్యకారక జలాలు సముద్రంలో కలిసి మత్స్యకారుల జీవనోపాధికే ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇప్పటికే అచ్యుపురం సెజ్‌లో ఏర్పాటుచేసిన ఫార్మా కర్మాగారాల వల్ల వ్యర్థజలాలు సముద్రంలో కలిసి పూడిమడక మత్స్యకారులు జీవనోపాధికి దూరమయ్యారని వాపోయారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేరుగు రాజేష్, పి.వెంకటేష్, ఎ.వినయ్, కె.అప్పలనాయుడు, రాజేష్, ముత్యాలు, అప్పలరాజు, రాంబాబు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇదే అంశంపై మండల కేంద్రం రాంబిల్లిలో ప్రజా సంఘాలు నిరసన తెలిపారు. మండల కేంద్రం రాంబిలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరశన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పరిశ్రమలు పెట్టి మత్స్యకారుల పొట్ట కొట్టవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు దోని కాశియ్య, చింతకాయల శివాజీ, యువజన సంఘం నాయకులు ఎస్.నారాయణరావు, వై.రాము పాల్గొన్నారు.